## మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి డాక్టర్ అన్వేష్



మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన డాక్టర్ అన్వేష్ కలుకూరి, చిత్రంలో కల్వకుంట్ల వంశీధర్‌రావు, రాష్ట్ర మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, అలేరు ఎమ్మెల్యే గొంగడి సునీత తదితరులు

చర్లపల్లి, ఆక్టోబర్ 10: తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు, కుషాయిగూడ సన్ సీడ్ వైద్యశాల ఎండీ డాక్టర్ అన్వేష్ కలుకూరి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీ రామారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు, రాష్ట్ర మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, అలేరు ఎమ్మెల్యే గొంగడి సునీత సమక్షంలో మంత్రి కేటీఆర్ డాక్టర్ అన్వేష్ కలుకూరి, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భానుచందర్, చామల ఉదయ్ చందర్‌రెడ్డిలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చామని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ చైర్మన్ చెవ్వ వెంకటేశం, వలిగొండ మండల వెల్వర్తి బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్యారి రాములు, ఉపాధ్యాక్షుడు పిట్టల కుమార్, దొడ్డు భాస్కర్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం..

**బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి**



మల్కాజిగిరి డివిజన్ కేశవనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 10: ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి డివిజన్ కేశవనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన సమావేశానికి మర్రి రాజశేఖర్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ప్రభుత్వం నెలనెలా పింఛన్లు అందజేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నదన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలుపరుస్తామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిపనులను చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, ప్రవీన్ గౌడ్, గంగాధర్, శ్రీకాంత్, బాలనర్సింహ, నరేష్, మల్లేష్, రాజుయాదవ్, నవీన్, ప్రదీప్, లత, భాగ్య, నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



మౌలాలి డివిజన్ పరిధి మహాత్మాగాంధీనగర్, ఓల్డ్ సఫిల్‌గూడలో ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నందికంటి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు.

# కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి..

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో 100 మంది
- చంపాపేటలో భారీ ఎత్తున చేరికలు



కాంగ్రెస్‌ను వీడి, బీఆర్ఎస్‌లో చేరుతున్న చంపాపేట హోలియ దాసరి బస్తీకి చెందిన 100 మందికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, అక్టోబర్ 10: కాంగ్రెస్ పార్టీ నుంచి వందమంది బీఆర్ఎస్ పార్టీలో చేరి హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు. చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బిట్టు చిరంజీవి ఆధ్వర్యంలో హోలియ దాసరి బస్తీ నుంచి సోమవారం రాత్రి ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్ష్యంలో 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ విస్తరణ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి పార్టీ గుర్తింపు లబిస్తుందన్నారు. నవంబర్ 30న జరగనున్న సాధారణ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో పనిచేసి ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటి శాసన సభా సభ్యత్వాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా అందివ్వాలన్నారు. అనంతరం బిట్టు చిరంజీవి మాట్లాడుతూ, తనకు ఊహ తెలిసినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీని అభిమానించి చదువు ముగియగానే కాంగ్రెస్ కార్యకర్తగా చేరి కొన్నేండ్లు పని చేశానన్నారు. ఎన్నేళ్లు పనిచేసినా కాంగ్రెస్ పార్టీ తన సేవలను పెద్దగా గుర్తించలేదు. తనను ఆ పార్టీలో పట్టించుకునే నాథుడే లేక పోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని చూసి తాను పార్టీలో చేరుతున్నట్లు తెలిపాడు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్ కుమార్‌రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవిముదిరాజ్, నాయకులు కళ్యాణ్, నిషీకాంత్‌రెడ్డి, ఉమామహేశ్వర్, శ్రీనాథ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పొరుగు పార్టీల ప్రస్థానమిక శూన్యం

- అభివృద్ధికి ఆకర్షితులయ్యే బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు
- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



రహ్మత్ నగర్ డివిజన్, సంతోష్‌గిరిలో బీఅర్ఎస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్, అక్టోబర్ 10: బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన రహ్మత్ నగర్ డివిజన్‌కు చెందిన 100 మంది జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రహ్మత్ నగర్ డివిజన్, సంతోష్‌గిరిలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హాజరై బీఆర్ఎస్ పార్టీ కండువాలను కప్పి వారందరినీ పార్టీలో ఆహ్వానించారు. అనంతరం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకు తప్ప మరే ఇతర పార్టీలకు మనుగడ లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు జనాదరణ పెరుగిందని, రాబోయే రోజుల్లో ఇతర పార్టీలన్ని తుడిచిపెట్టుకుపోవడం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఇంక మనుగడ లేదు



- బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- కాంగ్రెస్ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి
- నేడు బీఆర్ఎస్‌లో చేరిక

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబర్ 10: తెలంగాణలో కాంగ్రెస్‌కు ఇంక మనుగడ లేదని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చౌదరిగూడ కాంగ్రెస్ ఎంపీటీసీ పులకంటి భాస్కర్ రెడ్డి తెలిపారు. మండల పరిధి చౌదరిగూడ కాంగ్రెస్ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బుధవారం ఉదయం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ మినహా మిగతా పార్టీలు ప్రజాదరణ కోల్పోయినట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, గ్రామాలను మంత్రి మల్లారెడ్డి అన్ని రంగాలలో అభివృద్ధి పరచి ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఆయన చేసిన అభివృద్ధికి ఆకర్షణీయుడనై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. పలువురు వార్డు సభ్యులు, గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

## 'కార్వాన్'లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం



లంగర్‌హౌస్ లక్ష్మీనగర్ రింగ్‌రోడ్‌లో బీఆర్ఎస్ నాయకులతో సమావేశంలో మాట్లాడుతున్న కార్వాన్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ

మెహిదీపట్నం అక్టోబర్ 10: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కార్వాన్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. లంగర్ హౌస్ లక్ష్మినగర్ రింగ్ రోడ్‌లోని సీనియర్ నాయకులు కేసీ శేఖర్ రెడ్డి కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మిత్ర కృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర కృష్ణ మాట్లాడుతూ కార్పొరేటర్‌గా పజలకు ఎంతో సేవ చేశానని అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలతో వేలాది మంది లబ్ధి పొందారని అన్నారు. ప్రజల అండతో అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, సీనియర్ నాయకులు కేసీ శేఖర్ రెడ్డి, కావూరి వెంకటేష్, మంతటి నర్సింహ, తూంకుంట అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఐఐసీటీలో ఘనంగా బీఐఎస్ మానక్ మహోత్సవ్



సిటీబ్యూరో, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా నాణ్యతా ప్రమాణాల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తున్న శాస్త్రవేత్తలు, నిపుణులకు గౌరవ సూచకంగా సీఎస్ఐఆర్ – ఐఐసీటీలో బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో మానక్ మహోత్సవ్–2023 నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆయుష్ విభాగం డైరెక్టర్ దాసరి హరిచందన హాజరయ్యారు. పరిశోధనా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు, పాటలతో మొదలైన వేడుకలకు తోడుగా క్విజ్, చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగదు బహుమతులను దాసరి హరిచందన అందజేశారు. చీఫ్ సైంటిస్ట్‌లు డాక్టర్ శైలజ, డాక్టర్ శ్రీనాథ్, బీఐఎస్ హైదరాబాద్ డైరెక్టర్ కేవీ రావు, శాస్త్రవేత్తలు రాకేశ్ తన్నీరు, గోరేనంద్ ప్రసాద్ యాదవ్ విద్యార్థులకు పలు అంశాల్లోని వస్తువుల నాణ్యతపై వివరించారు. బీఐఎస్ కేర్ యాప్ ద్వారా బంగారం హాల్ మార్కింగ్, ఇతర వస్తువులపై ఐఎస్ఐ ముద్రను గుర్తించడం, నకిలీ, నాణ్యత లేని వస్తువులపై ఫిర్యాదు తదితర అంశాలను పీపీటీ ద్వారా వివరించారు. విద్యార్థులకు ఏడాదిపాటు వివిధ అంశాల్లో శిక్షణ, నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు స్టాండర్డ్స్ క్లబ్‌ను రూపొందించేందుకు ఒప్పందం చేసుకున్నారు.